21-09-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఎప్పటివరకైతే ఆత్మ పాత్రలో ఉంటుందో, అప్పటివరకూ తనకు 100 శాతం పూర్తి విశ్రాంతి లభించదు, విశ్రాంతి అనేది నిర్వాణధామంలోనే లభిస్తుంది, అక్కడ ఏ పాత్రా ఉండదు"

ప్రశ్న:- ఏ పిల్లలైతే నడుస్తూ-నడుస్తూ చదువుతో అలసిపోతారో, వారికి ఎటువంటి సంకల్పాలు వచ్చి వికల్పాల రూపాన్ని ధరిస్తాయి?

జవాబు:- 1. వారికి తండ్రిని వదిలేయాలి అనే సంకల్పాలు అనగా విడాకులు ఇచ్చే సంకల్పాలు వస్తాయి. బాబా అంటారు - ఈ సంకల్పం రావడం కూడా వికల్పమే. ఇటువంటి సంకల్పాన్ని చేయడం కూడా పాపమే. చదువును చదువుకోకపోవడం అంటేనే అలసిపోవడం. ఇటువంటి పిల్లలు తమ భాగ్యాన్ని పాడు చేసుకుంటారు. 2. ఒకవేళ ఏదైనా విషయం కారణంగా మాత, పితలపై అలిగితే, వారు 21 జన్మల రాజ్యాధికారాన్ని పోగొట్టుకుంటారు.

పాట:- ఈ రోజు మానవుడు అంధకారములో ఉన్నాడు... (ఆజ్ అంధేరే మే హై ఇన్సాన్...)

ఓం శాంతి. ఇది భక్తిలోని పాట లేక ప్రార్థన. ఎవరి వద్ద ప్రార్థన చేస్తారు? భగవంతుని వద్ద. కానీ ఘోర అంధకారములో ఉన్న కారణముగా భగవంతుని గురించి తెలియనే తెలియదు. మరి ఇప్పుడు ఎవరు వినాలి? ఎప్పుడైతే భగవంతుడు వారి పిలుపును వింటారో, అప్పుడే వచ్చి జ్యోతిని వెలిగిస్తారు. కానీ పిల్లలకు భగవంతుని గురించి తెలియనే తెలియకపోతే మరి వారు ఎలా వినగలరు? ఇప్పుడు మీరు సమ్ముఖముగా కూర్చున్నారు, భగవంతుడు మిమ్మల్ని ఘోర అంధకారము నుండి అత్యంత ప్రకాశములోకి తీసుకువెళ్తున్నారు. బ్రహ్మా యొక్క రాత్రి మరియు బ్రహ్మా యొక్క పగలు అని అంటూ ఉంటారు కూడా. రాత్రివేళలో ప్రతి ద్వారం వద్దకు ఎంతో భ్రమిస్తూ ఉంటారు కూడా. పర్వతాలపైకి, ధార్మిక స్థలాలకు, మందిరాలకు, మసీదులకు మొదలైనవాటికి వెళ్తారు. కానీ భగవంతుడు ఎక్కడ లభిస్తారు? భగవంతుడి జన్మను కూడా భారత్ లోనే జరుపుకుంటారు. శివరాత్రి అని అంటారు కదా. తప్పకుండా వారి స్మృతిచిహ్న విగ్రహాలు కూడా భారత్ లోనే ఉన్నాయి. కానీ వారు ఎప్పుడు వస్తారు అన్నది అర్థం చేసుకోరు! పూర్తిగా ఘోర అంధకారములో ఉన్నారు. ఇప్పుడు మీరు ఘోర అంధకారములో లేరు. మీరు నంబరువారు పురుషార్థానుసారముగా ప్రకాశములోకి వస్తూ ఉంటారు. ఈ సృష్టి అంతటినీ ఎవరు రచిస్తారు మరియు ఎలా రచిస్తారు అనేది మీకు తెలుసు.

మీరు ఇక్కడకు ఈశ్వరీయ విశ్వవిద్యాలయములోకి వచ్చారు, ఇక్కడ ఈశ్వరుడు చదివిస్తారు, మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేస్తారు. ఈ జ్ఞానాన్ని మీలో కూడా నంబరువారుగా అర్థం చేసుకుంటారు. కొందరు బాగా అర్థం చేసుకుంటారు, పూర్తిగా అర్థం చేసుకోని మరికొందరు పారిపోతారు, మాత-పితలపై అలుగుతారు. ఆశ్చర్యం కలిగేలా మాత-పితలపై అలుగుతారు. చూస్తారు, ఇతరులకు వినిపిస్తారు, మళ్ళీ అలుగుతారు... మాత-పితల ద్వారా తమకు 21 జన్మల కొరకు స్వర్గ రాజ్యాధికారం లభిస్తుందని తెలుసు, అయినా కానీ మర్చిపోతారు. బాబా అర్థం చేయించారు - దేనినైతే శాంతి అని అంటారో అది శాంతిధామము లేక నిర్వాణధామములోనే లభిస్తుంది, దానిని ముక్తిధామము అని కూడా అంటారు. ఒకవేళ ఎవరైనా మేము 100 శాతం విశ్రాంతిలో ఉన్నాము అని అన్నా సరే, ఆ మాట సరికాదు. రోజంతటిలో ఏదో ఒక కర్మ తప్పకుండా జరుగుతుంది. అయితే, అల్పకాలికముగా రాత్రివేళలో తీసుకునే నిద్రను విశ్రాంతి అని అంటారు ఎందుకంటే ఆత్మ అంటుంది - నేను రోజంతా పని చేసి అలసిపోయాను, ఇప్పుడు ఇక విశ్రాంతి తీసుకుంటాను, తనను తాను శరీరము నుండి అతీతము చేసుకుంటుంది. తండ్రి శాంతి దేశములో ఉంటారని మీకు తెలుసు లేక పరమపిత పరమాత్మ అక్కడ విశ్రాంతిలో ఉంటారని భావిస్తారు. కానీ ఎప్పుడైతే తమ పాత్ర ఉండదో అప్పుడే పరమపిత పరమాత్మ విశ్రాంతిలో ఉంటారు. ముక్తిధామంలో ఏ పనీ చేయరు. ఇవి బాగా అర్థం చేసుకోవలసిన విషయాలు. ఇప్పుడు మీ బుద్ధి తాళం తెరుచుకుంటూ ఉంటుంది. తండ్రి అంటారు, నేను విశ్రాంతిలో ఎప్పుడు ఉంటానో మీకు తెలుసా? ఎప్పుడైతే పిల్లలైన మీరు స్వర్గములో, సుఖములో ఉంటారో అప్పుడు. అక్కడ మీకు సుఖ-శాంతులు ఉంటాయి. దానిని విశ్రాంతి అని అనరు. ఎప్పుడైతే మీకు ఏ పాత్రా ఉండదో అప్పుడే దానిని విశ్రాంతి అని అంటారు. ఎప్పుడైతే మీరు స్వర్గములో ఉంటారో, అప్పుడు నేను ఏ విధముగానూ శ్రమించవలసిన అవసరం ఉండదు. నేను అక్కడ (ఇంటిలో) శాంతిలో ఉంటాను, అక్కడ శాంతిని ఇంకొక మాటలో విశ్రాంతి అని అంటారు. ఇక్కడైతే విశ్రాంతిలో ఉండలేరు. ఆత్మ అంటుంది - ఎప్పుడైతే రాత్రివేళ నిదురిస్తానో, ఆ సమయంలో నేను విశ్రాంతిలో ఉంటాను, ఆ

సమయంలో విశ్రాంతిలో ఉన్నాను అని అన్నా లేక శాంతిలో ఉన్నాను అని అన్నా విషయం ఒక్కటే. రాత్రివేళలో అశరీరిగా అవుతారు, శాంతిగా అవుతారు. మళ్ళీ లేచిన తర్వాత కర్మలలోకి వస్తారు, అప్పుడు విశ్రాంతి ఉండదు. కర్మలు చేస్తూ విశ్రాంతి లేకపోవడాన్ని ఫీల్ అవుతారు. సత్యయుగములో విశ్రాంతి లేకపోవడమనే మాటే ఉండదు, విశ్రాంతి లేకుండా చేసేది మాయ. మేము విశ్రాంతిలో ఉంటాము అని అక్కడ అనరు. అక్కడ కార్య వ్యవహారాలన్నీ చేసుకుంటారు కానీ అశాంతిగా ఉండరు. అక్కడ విశ్రాంతి అనే పదము ఉండదు. ఒకవేళ ఎవరైనా - మేము విశ్రాంతి తీసుకునేందుకు షిమ్లా వెళ్తున్నాము అని అంటే, అందులో విశ్రాంతి అన్న పదానికి అర్థం లేదు. ఎప్పుడైతే మనం నిర్వాణధామంలో ఉంటామో అప్పుడే సత్యమైన విశ్రాంతి లభిస్తుంది, అక్కడ నిశ్శబ్దంగా ఉంటాము. ఇక్కడ విశ్రాంతి ఎవరికీ లేదు. ఒకవేళ ఎవరైనా, మాకు 100 శాతము విశ్రాంతి ఉంది అని అంటే అది తప్పు, దానిని అజ్ఞానము అని అంటారు. అయితే - ఎవరికైనా చదువు చదువుకోవాలని లేకపోతే వారు విశ్రాంతి తీసుకుంటాము అని అంటారు. చదువుకోకపోవడం, విశ్రాంతి తీసుకోవడం, ఇది మరి అలసిపోవడమే కదా. వారు తమ భాగ్యాన్ని తామే పాడు చేసుకుంటారు.

ఓ రాత్రి ప్రయాణీకుడా, స్వర్గానికి వెళ్ళే మార్గములో నడుస్తూ, నడుస్తూ అలసిపోకు, అలిగిపోకు అని అర్థం చేయించడం జరుగుతుంది. మాత-పితలకు విడాకులు ఇచ్చే సంకల్పాన్ని కూడా రానివ్వకూడదు. ఈ సంకల్పం చేసారంటే దానిని వికల్పము అనే అంటారు. ఏ మాత-పితల ద్వారానైతే స్వర్గ రాజ్యాధికారము లభిస్తుందో, వారి గురించి సంకల్పాన్ని కూడా ఎందుకు రానివ్వాలి! అప్పుడప్పుడూ - వదిలేయాలి, ఏమీ అర్థం కావడం లేదు అన్న సంకల్పం వస్తుంది అని వ్రాస్తారు. అరే, ఇది అర్థం చేసుకోవలసిన సమయం కదా. అర్థం చేసుకోవడం అనగా చదవడము, మనం చదువుకుంటున్నామని మీకు తెలుసు. జ్ఞాన సాగరుడైన, ఉన్నతోన్నతుడైన పరమపిత పరమాత్మ గురించి ఎవ్వరికీ తెలియదు. బ్రహ్మ, విష్ణు, శంకరులు మరియు లక్ష్మీ-నారాయణుల గురించి తెలుసు కానీ భారతవాసులకు - లక్ష్మీనారాయణులు రాజ్యాన్ని ఎప్పుడు తీసుకున్నారు మరియు అది వారికి ఎవరు ఇచ్చారు అన్నది తెలియదు. మాయ పూర్తిగా ఘోర అంధకారములోకి తోసేసింది. రచయిత అయిన తండ్రి మనుష్య సృష్టిని ఎలా రచిస్తారు అనేది తండ్రి వచ్చి అర్థం చేయిస్తారు. ఇది ఎవ్వరికీ తెలియదు. తండ్రియే కూర్చొని అర్థం చేయిస్తారు. ప్రజాపిత బ్రహ్మను సృష్టికర్త అని అనరు. వారిని ప్రజాపిత అని అంటారు కానీ వారు రచయిత కాదు. మమ్మల్ని అల్లాహ్ పుట్టించారు అని మనుష్యులు అంటారు. నిరాకారుడైన తండ్రినే రచయిత అని అంటారు. రచయిత అయిన తండ్రి గురించి తప్పకుండా మనుష్యులే తెలుసుకుంటారు, జంతువులు తెలుసుకోవు కదా. మమ్మల్ని పరమాత్మ రచించారు అని జంతువులైతే తమ నోటితో అనవు. మమ్మల్ని భగవంతుడు రచించారు అని మనుష్యులు అంటారు. ఈ రచనను ఎలా రచించానో చూడండి అని తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. మొట్టమొదట ముఖవంశావళి యొక్క రచన జరుగుతుంది. పిల్లలు పెద్ద అయ్యి తర్వాత తండ్రిగా అవుతారు. అనంతమైన తండ్రి అంటారు - నేను కూడా రచనను ఎలా రచిస్తానో చూడండి. ఇతనిలోకి ప్రవేశించి ఇతని నోటి ద్వారా ఇలా చెప్తాను - హే ఆత్మా, నీవు నా వాడివి, నేను నీ తండ్రిని. తర్వాత ఇతని ద్వారా పిల్లలైన మిమ్మల్ని రచిస్తాను. మీరు ముఖవంశావళి. అజ్ఞానకాలంలో కూడా అంటారు కదా - నీవు ఎలా ఉన్నా, ఎవరై ఉన్నా, అచ్చంగా అలా నా వారే. ఈ తండ్రి కూడా అలాగే అంటారు. మీరు బ్రహ్మకు పిల్లలుగా అవుతారు. కావున ఇప్పుడు మీరు ముఖవంశావళి, తర్వాత మీరు కుఖవంశావళిగా కూడా అవుతారు. తండ్రి అంటున్నారు - మీరు నా వారు, తర్వాత మీరు దైవీ వంశములోకి వెళ్తారు. తండ్రి ఈ ఈశ్వరీయ రచనను ఎలా రచిస్తారు - ఇది ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. నేను కూడా ముఖవంశావళిగా అవుతాను అని ఈ బ్రహ్మ కూడా అంటారని తండ్రి అర్థం చేయిస్తారు. తండ్రితోపాటు తల్లి తప్పకుండా కావాలి. మేము ప్రజాపిత బ్రహ్మ ముఖవంశావళి అని, శివబాబా మమ్మల్ని తమవారిగా చేసుకున్నారు అని మీరు అంటారు. వారికి శరీరమైతే కావాలి కదా. శివబాబాకైతే శరీరము లేదు. శరీరాన్ని అద్దెకు తీసుకుంటారు. ఆ తర్వాత, మీరు నా వారు అని అంటారు, దీనిని ముఖవంశావళి అని అంటారు. శివబాబా ఈ ముఖము ద్వారా, ఈ స్త్రీ (బ్రహ్మ) ద్వారా - మీరు నా పిల్లలు అని అంటారు. తండ్రియే అర్థం చేయిస్తారు, ఇంకే శాస్త్రాలు మొదలైనవాటిలో ఈ విషయాలు లేవు. మీరు ఇప్పుడు వింటారు, తర్వాత కనుమరుగైపోతుంది.

ఈ సమయంలో ఘోర అంధకారము ఉంది. తండ్రి వచ్చి ప్రకాశాన్ని ఇస్తారు, కావుననే బ్రహ్మ యొక్క రాత్రి మరియు బ్రహ్మ యొక్క పగలు అని అంటూ ఉంటారు. ఎంతో కొంత అయితే ఉంది కదా. అంతా అసత్యమే, సత్యము ఇసుమంత కూడా లేదు అని అంటూ ఉంటారు. కానీ తండ్రి అంటారు - ప్రపంచం ఎంతో కొంత ఉంటుంది, ప్రళయం జరుగదు, కొందరు ఉంటారు, ఆ తర్వాత వృక్షము వృద్ధి చెందుతుంది. మనుష్యులు మహాప్రళయాన్ని చూపించారు. కానీ మహాప్రళయం ఎప్పుడూ జరుగదు. సముద్రములో బాలుడు రావి ఆకుపై తేలుతూ రావడమనేది జరుగదు, ఇవన్నీ ప్రగల్భాలు. తండ్రి

అర్థం చేయించారు, మీరు ఎప్పుడైతే గర్భమహలు నుండి వస్తారో అప్పుడు అక్కడ ఆనందములో ఉంటారు. అక్కడ దుఃఖము, పాప కర్మలు ఉండవు. అది ఉన్నదే పుణ్యాత్ముల ప్రపంచము, ఇది పాపాత్ముల ప్రపంచము. ఇక్కడ మీరు అంతా త్యాగం చేసి సదా పుణ్యాత్ములుగా అవుతారు. మీరు ఎంతటి పుణ్యం చేస్తారంటే, ఇక అర్ధకల్పం వరకు ఎవరూ మిమ్మల్ని పాపాత్ములు అని అనరు. మీరు అవినాశీ పుణ్యాత్ములుగా అయిపోతారు. ఇక్కడ మళ్ళీ అర్ధకల్పం పాపాత్ములు అని అంటారు. ఘడియ-ఘడియా దాన-పుణ్యాలు చేస్తూ ఉంటారు. భారత్ ను సంపూర్ణ ధర్మాత్మ అని అంటారు. భారత్ లో దాన-పుణ్యాలు చేస్తారు. ఈ ప్రపంచాన్ని మనం వదలనున్నామని, మళ్ళీ ఇందులోకి వచ్చేది లేదని మీకు తెలుసు. ఈ ప్రపంచ సామాగ్రిని మీరు కొత్త ప్రపంచము కొరకు ట్రాన్స్ఫర్ చేసుకుంటారు. మనుష్యులు ఈశ్వరార్పణం చేస్తారు అనగా మరుసటి జన్మ కొరకు ట్రాన్స్ఫర్ చేసుకుంటారు. ఇక్కడ మీరు 21 జన్మల కొరకు ట్రాన్స్ఫర్ చేసుకుంటారు. కావున ఎంతో కావాలి కదా. మీ నుండి మొత్తం చెత్తనంతటినీ తీసుకొని కొత్తవి ఇస్తారు. పాతవి తీసుకొని బంగారంవి ఇస్తారు. మీరు సత్యతతో తండ్రికి ఇస్తారు, తండ్రి కూడా మీకు సర్వస్వమూ ఇస్తారు. మీ పాత్ర ఏదైతే కొనసాగుతూ వచ్చిందో అది డ్రామాలో ఉంది, అందరూ ఇళ్ళు-వాకిళ్ళను వదిలేసారు. లేకపోతే గోశాల ఎలా తయారవుతుంది? భట్టీ ఎలా తయారవుతుంది అనేది మనుష్యులకు తెలియదు! పిల్లి పిల్లలు మొదలైనవి అందులో ఉన్నాయి అన్నట్లు వారు చూపిస్తారు.

ఈ జ్ఞానమంతా పిల్లలైన మీకు ఇప్పుడు ఉంది. తర్వాత అక్కడ ఈ జ్ఞానము ఉండదు. మనం ఈ విధంగా 21 జన్మలు రాజ్యం చేస్తాము, మళ్ళీ పడిపోతాము - అని అక్కడ ఈ జ్ఞానము ఉండదు. త్రికాలదర్శులుగా అయ్యే పాత్ర మీలో ఇప్పుడే ఉంటుంది. ముఖ్యమైన హీరో-హీరోయిన్ల పాత్ర మీదే, ఈ పాత్ర ఇంకెవ్వరికీ లేదు. అసురుల నుండి దేవతలుగా, మళ్ళీ దేవతల నుండి అసురులుగా భారతవాసులైన మీరే అవుతారు, మిగిలినవన్నీ ఉపకథలు మాత్రమే. నాటకం మధ్యలో నవ్వు పుట్టించే ఆటలు కూడా ఆడతారు కదా. అర్ధకల్పం తర్వాత దేవీ-దేవతా ధర్మం కనుమరుగైపోతుంది. మీ బుద్ధిలో ఈ చక్రమంతా తిరుగుతూ ఉంటుంది, అందుకే మీరు అర్థం చేయిస్తారు కదా. పరమపిత పరమాత్మ కూడా పరమ ఆత్మయే, వారు పరంధామంలో ఉంటారు. తండ్రి అంటారు, నాలో జ్ఞానమంతా ఉంది. నేను మనుష్య సృష్టికి చైతన్య బీజరూపుడను. అక్కడ అవి జడమైన బీజాలు, శివుడైతే చైతన్యమైన బీజము. వారి ప్రతిమ పూజించబడతుంది.

ఈ రోజుల్లో గవర్నమెంట్ వృక్షాలకు అంట్లు కడుతూ ఉంటుంది. వీరు చైతన్య బీజము. వీరిని మనుష్య సృష్టి రూపీ వృక్షానికి బీజము అని అంటారు. నాకు మొత్తం వృక్షము యొక్క జ్ఞానము ఉంది. కావున ఎవరైనా మేము 100 శాతము విశ్రాంతిలో ఉన్నాము అని అంటే, 100 శాతమూ పూర్తి విశ్రాంతి ఎప్పుడూ లభించదు అని అర్థం చేయించాలి. అయితే, స్వర్గములో 100 శాతము పవిత్రత, సుఖ-శాంతులు ఉంటాయి అని అనవచ్చు. దాని పేరే స్వర్గము. తండ్రిని సత్ శ్రీ అకాల్ అని అంటారు. వారు సత్యము వినిపించేవారు. వారిని మృత్యువు కబళించదు. వారిని కాలుడికే కాలుడు అని అంటారు. తండ్రి అంటారు, ఇది ఛీ-ఛీ ప్రపంచము. ఈ ప్రపంచానికి తప్పకుండా నిప్పు అంటుకోనున్నది. ఈ మహాభారత యుద్ధము మహా కళ్యాణకారి అని పిల్లలైన మీకు తెలుసు. మనుష్యులు శాంతి ఏర్పడాలని యజ్ఞాలను రచిస్తారు అనగా స్వర్గ ద్వారాలు తెరుచుకోకూడదు అని భావిస్తున్నట్లు. మీరైతే చప్పట్లు కొడతారు - ఈ ప్రపంచానికి నిప్పు అంటుకుంటే మేము కొత్త ప్రపంచమైన వైకుంఠములోకి వెళ్తాము అని. ఈ వినాశ జ్వాల ఈ రుద్ర జ్ఞాన యజ్ఞము నుండే ప్రజ్వలితమయ్యింది. ఎవరైతే తండ్రికి చెందినవారిగా అవుతారో వారే స్వర్గాధిపతులుగా అవుతారు. మిగిలినవారందరూ లెక్కాచారాలను తీర్చుకొని తిరిగి వెళ్ళాలి. ఇప్పుడు తిరిగి ముక్తిధామంలోకి వెళ్ళి మళ్ళీ మన పాత్రను రిపీట్ చేయాలని మీకు తెలుసు. సత్యయుగములో ఇంతమంది దేవీ-దేవతలు ఎక్కడి నుండి వచ్చారు? మనుష్యుల నుండి దేవతలుగా తయారుచేసేందుకు భగవంతునికి ఎంతో సమయం పట్టదు అని అంటారు. మిమ్మల్ని గవ్వల నుండి వజ్రాల వలె, పతితుల నుండి పావనులుగా తయారుచేస్తారు. ఎవరు ఎంతగా జ్ఞానాన్ని ధారణ చేస్తారో అంతటి పదవిని పొందుతారు. రాజధాని స్థాపన అవుతోంది. మనం మన కొరకు శ్రీమతంపై స్వర్గాన్ని స్థాపన చేసుకుంటున్నామని మీకు తెలుసు. ఒకవేళ ఎవరైనా శ్రీమతంపై అలిగి తమ మతమనుసారముగా నడిచినట్లయితే అది రావణ మతమైపోతుంది. అందుకే అడుగడుగునా మీరు శ్రీమతాన్ని తీసుకుంటూ ఉండండి. తండ్రి మిమ్మల్ని జీవిస్తూ ఉండగానే ట్రస్టీలుగా తయారుచేస్తారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. సంపూర్ణ దానీలుగా అవ్వాలి. సత్యతతో అంతా తండ్రికి అర్పణ చేసి కొత్త ప్రపంచం కొరకు ట్రాన్స్ఫర్ చేసుకోవాలి.

2. జీవిస్తూ ఉండగానే ట్రస్టీలుగా అవ్వాలి. అడుగడుగునా తండ్రి నుండి శ్రీమతాన్ని తీసుకోవాలి. ఎప్పుడూ శ్రీమతంపై అలిగి మన్మతంపై నడవకూడదు.

వరదానము:- కంబైండ్ రూపధారిగా అయి సేవలో ఈశ్వరీయ ఇంద్రజాలాన్ని అనుభవం చేసే ఈశ్వరీయ సేవాధారీ భవ

స్వయాన్ని కేవలం సేవాధారిగా కాదు, కానీ ఈశ్వరీయ సేవాధారిగా భావిస్తూ సేవ చేయండి. ఈ స్మృతి ద్వారా స్మృతి మరియు సేవ స్వతహాగా కంబైండ్ అవుతాయి. ఎప్పుడైతే భగవంతుడిని సేవ నుండి వేరు చేస్తారో, అప్పుడు ఒంటరిగా ఉన్న కారణంగా సఫలత అనే గమ్యము దూరముగా కనిపిస్తుంది. అందుకే కేవలం సేవాధారి కాదు, కానీ నేను ఈశ్వరీయ సేవాధారిని - అన్న పేరు సదా గుర్తున్నట్లయితే సేవలో స్వతహాగానే ఈశ్వరీయ ఇంద్రజాలము నిండుతుంది మరియు అసంభవము కూడా సంభవమవుతుంది.

స్లోగన్:- కర్మయోగిగా అవ్వాలంటే కమల ఆసనధారిగా (అతీతంగా మరియు ప్రియంగా) అవ్వండి.